క్లుప్తంగా

ఉక్కు సాధన సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడపలో టీడీపీ మహానాడు జరుగనున్న నేపథ్యంలో జిల్లా ప్రజల ఆకాంక్ష అయిన కడపలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న కడప ప్రెస్ క్లబ్‌లో జరుగు ఉక్కుసాధన సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఉక్కు సాధన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నదని, టీడీపీ సహకారంతో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం విభజన హామీలపై చర్యలు తీసుకునేటట్లు ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలు

కడప అర్బన్: కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో వున్న అర్జున్ హాస్పిటల్‌లో శుక్రవారం చెన్నై అపోలో హాస్పిటల్ నుంచి లివర్ వైద్య నిపుణులు డాక్టర్ యువియు వంశీధర్ రెడ్డి విచ్చేసి వైద్య పరీక్షలు చేయనున్నారని అర్జున్ హాస్పిటల్ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా అర్జున్ హాస్పిటల్‌లో ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలను నిర్వహించనున్నామని.. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు డాక్టర్ అందుబాటులో ఉంటారన్నారు. వివరాలకు 9985422583, 83320 80900 అనే నంబర్లలో సంప్రదించగలరని హాస్పిటల్ యాజమాన్యం తెలియజేసింది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశ భక్తి అని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నగర కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో మూడవ దఫా కొలువు దీరిన బీజేపీ ప్రభుత్వం ప్రజల ఐక్యత, దేశ సమైక్యత, సమగ్రతలను గాలికి వదిలేసి ఓట్ల కోసం, మత విభజన రాజకీయాలు చేస్తున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి అని, పాలకులు గుర్తించే వరకు ప్రజలు సమైక్యంగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం కడప నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, రవి, కిరణ్, నరసింహ, రామకష్టారెడ్డి, స్టీఫెన్, గోవిందు, వంశీ పాల్గొన్నారు.

ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ప్రకటించిన జీవోలు తక్షణం జారీ చేయాలని కోరుతూ ఈనెల 26న తలపెట్టిన ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి తెలిపారు. గురువారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ లక్ష 50 వేల రూపాయలు, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంపు, 180 రోజులు చొప్పున రెండు కాన్పులకు వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించారు తప్ప ఇంతవరకు జీవోలు జారీ చేయలేదని తెలిపారు. ఆ జీవోలు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి సి. అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాటేమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని చెన్నంరాజుపల్లె గ్రామంలో వెలసిన శ్రీపాటేమ్మ తిరునాల ఉత్సవాలు గురువారం ఆలయ కార్యనిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీ ఆంజనేయా.. అభయప్రదాతా..

కడప కల్చరల్ : హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలో దాదాపు అన్ని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. అంజనా సుతుని ఆలయాలను ప్రధాన ద్వారం వద్ద కనుల పండువగా పూలతో తీర్చిదిద్దారు. మొక్కులుగల వారు ప్రత్యేకంగా పలు రకాల ద్రవ్యాలను సమర్పించి పవన సుతునికి ప్రణమిల్లారు.

– కడప నగరం కో ఆపరేటివ్ కాలనీ ఆలయంలో భక్తులు వడమాలతో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. శ్రీ ఆంజనేయస్వామికి పలు రకాల పూలు, ప్రత్యేకించి కలువ పూలతో అలంకారం చేశారు. చిన్నచౌకు శ్రీ వీరాంజనేయస్వామి ఆల యంలో అర్చకులు నాగనరసింహభట్టర్ శాంతి హోమం నిర్వహించారు. ఆకుపూజలు, వడమాల, మంగళ హారతి సమర్పించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు రఘువీరశర్మ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. దేవదాయశాఖ కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు స్వామి దర్శనానికి వేచి ఉండి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గాలిదేవర ఆలయంలో..

కడప నగరం పాత బస్టాండువద్దగల శ్రీ గాలి దేవర ఆంజనేయస్వామి ఆలయంలో స్వామిని విశేషంగా అలంకరించారు. ఉదయం 5.00 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. అభిషేకం, అలంకారం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. భక్తుల బృందాలు, భక్తులు భజనలు, భక్తి గీతాలాపనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు.

ఇందిరానగర్‌లో..

కడప నగర శివార్లలోని ఇందిరానగర్‌లోగల శ్రీ భద్రాద్రి రామాలయంలో హనుమంతునికి విశేషంగా పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయ నిర్వాహకులు, బాలాజీ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి విశేష అభిషేకం, అలంకారం, ఆకుపూజ, వడమాల సేవ నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. నగర పరిధిలోని పలు హనుమంతుని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



మారుతినగర్‌లో హనుమంతునికి కనుల పండువగా అలంకారం



విశేష అలంకారంలో శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి



కో ఆపరేటివ్ కాలనీలో అభయాంజనేయ స్వామిగా దర్శనం



నెహ్రూనగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామికి విశేష అలంకారం



చిన్నచౌకులోని హనుమంతుని ఆలయంలో స్వామికి విశేష అలంకారం

ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామి

రాజుపాళెం : హనుమజ్జయంతిని పురస్కరించుకొని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో గురువారం సాయంత్రం ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఉదయం నుంచి శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు, వడమాల, అభిషేకాలను వేద పండితులు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి దంపతులు, భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని పల్లకిలో ఆశీనులు చేసి మేళతాళాల మధ్య భజన పాటలు పాడుకుంటూ అంగరంగ వైభవంగా ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులైన ఆలయ మాజీ చైర్మన్ విజయలక్ష్మి, కానాల బలరామిరెడ్డి, పగిడాల సర్పంచ్ కానాల రాధ, రామచంద్రా రెడ్డిలు స్వాములకు పూజలు చేసి ప్రసాదాన్ని పంచిపెట్టారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు పాల్గొన్నారు.



వెల్లాలలో ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

నీటి తొట్ల ఏర్పాటు

వల్లూరు : మూగజీవులైన పక్షులు, జంతువుల దాహార్తిని తీర్చడం కోసం రేపటి మార్పు కోసం యూత్ సంఘం ఆధ్వర్యంలో వల్లూరు గ్రామంలో నీటి తొట్లను ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ఇతర సంఘ సభ్యులతో కలిసి ఎస్ఐ పెద్ద ఓబన్న గురువారం తొట్లకు నీటిని పట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూగజీవులకు దాహం తీర్చడానికి నీటి తొట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాలను మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రేపటి మార్పు కోసం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న సాయికుటీర్‌రోడ్డులో ముగ్గురు మట్కా నిర్వాహకులను త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను ఎస్ఐ హనుమంత్ గురువారం రాత్రి మీడియాకు తెలిపారు. సాయికుటీర్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ హనుమంత్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తికి చెందిన జి విశ్వనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరులోని ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన జె నరసింహులు, దేవాంగపేటకు చెందిన జి వీరయ్యలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 95 వేలు నగదుతో పాటు మట్కా స్లిప్పులు, పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు గర్భం దాల్చిన ప్పటి నుంచి తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. గురువారం కడప నగర పరిధిలోని నాగరాజు పేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో తల్లులకు కాన్పు సమయంలో సంభవించే ప్రీ ఎక్లంప్సియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా వైద్యులు హరి ప్రసాద్, వర్షిత సింహ, హెల్త్ సూపర్ వైజర్ రామాంజనమ్మ, సూపర్‌వైజర్ సుబ్బారాయుడు, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతు రచనల్లో సామాజిక పరిణామ క్రమం

మైదుకూరు : ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి రచనల్లో సామాజిక పరిణామ క్రమాన్ని చూడవచ్చని రచయిత, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. గురువారం మైదుకూరులో ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో సాహితీ ప్రియులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ కథ నవలల్లో ఏ అంశాన్ని తీసుకున్నా వస్తువును దృష్టిలో పెట్టుకోవాలే తప్ప రచయితల దృష్టి కోణంలో చూడవద్దని కేతు పేర్కొన్నట్టు తెలిపారు. రాయలసీమ నేపథ్యాన్ని ఈ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల వారి స్థితిగతుల్ని కేతు విశ్వనాథరెడ్డి తన రచనల్లో చిత్రీకరించారని వివరించారు. ఆధునిక సాహితీ లోకంలో యువ రచయితలకు ఆయన దీపధారని పేర్కొన్నారు. సభ అధ్యక్షుడు బొమ్మిశెట్టి రమేష్ , రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి మాట్లాడుతూ కేతు సాహితీ రంగంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం యువ సాహితీ వేత్తలకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పాలిమేర ఓబన్న, సాహితీ ప్రియులు, గోసల వీర రాఘవరెడ్డి, డి.వెంకట రమణారెడ్డి, చిత్రకారుడు కైపు బాలరాజు, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇల్లు కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

– కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం శివానందపురంలో పిచ్చమ్మ అనే వృద్ధురాలి ఇంటిని జేసీబీతో కూల్చిన కాల్‌మనీ దందా బాల గురవయ్యతోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బాధితురాలి ఇంటిని పరిశీలించినంతరం గురువారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, రాయలసీమ ఎస్సీ ఎస్టీ మానవ హక్కుల వేదిక నాయకుడు జేవీ రమణ, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, ఆర్‌సీపీ నేత ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంలో రిమ్స్ సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఇంటి పన్నులు, నీటి పన్నులు, కరెంటు బిల్లుల్లో పేర్లు మార్చుకుని పేదల ఆస్తులను స్వాహా చేసే వారికి పోలీసులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. శివానందపురం ఎస్సీ కాలనీలో నివసిస్తున్న పిచ్చమ్మ ఇంటిపై ఈనెల 18న దాడి చేసి సామాన్లను ఎత్తుకెళ్లి ఇంటికి బీగం వేశారని తెలిపారు. ఈనెల 21వ తేది ఉదయం పిచ్చమ్మ ఇంటిని నేలమట్టం చేశారని పేర్కొన్నారు. కాల్‌మనీ ముఠా నాయకుడు బాల గురవయ్య ఆగడాలకు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ చంద్రబోసు అండగా ఉంటున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి పిచ్చమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిలువ నీడలేని పిచ్చమ్మ కుటుంబానికి కూడు, గూడు తక్షణమే కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, మద్దిలేటి, సీహెచ్ ఆర్‌డీ నాయకుడు శివారెడ్డి, ఆద్మీపార్టీ నాయకుడు శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ, బీసీ వేదిక నాయకుడు డీఎం ఓబులేశు, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు ఆంజనేయులు, హేతువాద సంఘం జిల్లా కన్వీనర్ సీఆర్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య విలువల ఔన్నత్యం పెంచిన వేటూరి



వేటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీ అభిమానులు

కడప కల్చరల్ : ప్రముఖ కవి వేటూరి సుందర రామమూర్తి తెలుగు సాహిత్య విలువల ఔన్నత్యాన్ని మరింతగా పెంచారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం కడప స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో వేటూరి సుందర రామమూర్తి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట వేటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, బ్యాంకు గంగయ్య, తుపాకుల నారాయణ, సీవీ కృష్ణయ్య, కేవీ సుబ్బరాయుడు, కేసీ పుల్లయ్య, సోము వెంకటసుబ్బయ్య, బి రామమోహన్ రెడ్డి, ఎం సుబ్బరాయుడు, జి పుల్లయ్య, వర్మ పాల్గొన్నారు.

బాలలతోపాటు పెద్దల ఉన్నతి కూడా సాధ్యమే



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి

కడప కల్చరల్ : బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయంలోని కార్యక్రమాలలో బాలలతోపాటు పెద్దల ఉన్నతి కూడా సాధ్యమేనని పలువురు అతిథులు తెలిపారు. గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలోని కడప నగరంలోగల ఓం శాంతి సేవా కేంద్రం ప్రధాన కార్యాలయంలో కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌ఛార్జి రాజయోగిని బ్రహ్మకుమారీ గీతా బెహన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా ప్రత్యేకించి 22నుంచి 24వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు శ్రీరామిరెడ్డి, దినేష్‌రెడ్డితోపాటు ఉపాధ్యాయులు శివరాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత అతిథులు కార్యక్రమ ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి శాంతి గీతాలాపనలు చేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ మెడిటేషన్ ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని, విలువల ఆధారంగా విద్య, చదువులో పురోగతి తప్పక సాధించగలమని తెలిపారు. యోగా, ధ్యానం తదితర కార్యక్రమాల ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తాయన్నారు. కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజయోగిని బ్రహ్మకుమారి గీతా బెహన్ మాట్లాడుతూ పిల్లల కోసం వేసవి శిబిరాలను యేటా నిర్వహిస్తున్నామని, వీటి ఉద్దేశ్యం పిల్లల్లో సానుకూలతలను కల్పించడమేనని తెలిపారు. శిబిరాల్లో పాల్గొనే వారు అంతర్గత శాంతి, మానసిక దృష్టిని పెంచేందుకు రాజయోగ మెడిటేషన్ పద్ధతులను నేర్చుకుంటారన్నారు. చిన్నారుల్లో కళ, విలువలు, మాటపాటలు, ఆటల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఈశ్వరీయ కానుకను చిన్నారులు, అతిథులకు అందజేశారు.

వేసవి శిబిరంలో ఆసక్తిగా విద్యార్థులు



చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

కడప కల్చరల్ : కడప నగరంలోని వేసవి శిక్షణా శిబిరంలో గురువారం విద్యార్థులు ఆసక్తికరంగా పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక వేసవి వినోదం పేరిట శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, ఓరిగామి, క్రీడలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల్లో ప్రత్యేకంగా బేసిక్ కమ్యూనికేషన్ స్కిల్స్ ను అభ్యసించగా, క్రాఫ్ట్, ఓరిగామి ద్వారా చేతి పనులకు ప్రోత్సాహం లభించిందని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు వివిధ అంశాలను విద్యార్థులు నేర్చుకున్నారని పేర్కొన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులు ప్రదర్శిస్తున్న చురుకుదనం, శ్రద్ధ నిర్వాహకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు రిసోర్స్ పర్సన్స్ రంగనాయకులు, గఫూర్, కామేశ్వరమ్మ, నరసింహులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంపై మనసు పెడితే మార్కులు సాధించవచ్చు



గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కడప కల్చరల్ : గణితాన్ని అభ్యసించడంపై మనసు పెడితే అధికంగా మార్కులు సాధించవచ్చని గణిత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం తరగతుల్లో భాగంగా విద్యార్థులకు సులభ శైలిలో గణితం ఎలా నేర్చుకోవాలో ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం నేర్పించారు. అన్నింటి కంటే గణితం సులభంగా అర్థం చేసుకోవచ్చని తెలియజేశారు. ఉదయం కథా సమయంలో విద్యార్థులతో కథలు చదివించారు. వ్యాయామ ఉపాధ్యాయిని భారతి విద్యార్థులతో యోగా, ఇండోర్ గేమ్స్ నేర్పించారు. ఈ సమ్మర్ క్యాంపునకు పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్య లో హాజరయ్యారు. కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ పర్యవేక్షించారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి



బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాయలసీమ సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ ఎస్పీ మహమూద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 31న ఉదయం 11 గంటలకు సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంగమేశ్వరం వద్ద జరిగే భారీ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు వలన రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ అలుగు వల్ల కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతోనే అలుగు నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. సిద్ధేశ్వరం అలుగు రాయలసీమ రైతులకు సంబంధించి ఆకాంక్ష అని, ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించాలని కోరారు. సిద్ధేశ్వరం అలుగు సాధన కోసం ఈనెల 31న జరిగే బహిరంగ సభకు ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్లుగా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ముందుకు సాగకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి అలుగు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, రాయలసీమ విద్యార్థి సంఘం కన్వీనర్ హరిత, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా



ప్లేస్‌మెంట్‌కు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: కడప స్పిరిట్స్ డీగ్రీ కాలేజీలో హైదరాబాద్ నవతా ట్రాన్స్ పోర్ట్ కంపెనీ వారు గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలలో 18 మంది వివిధ పోస్టులకు ఎంపిక అయినట్లు కాలేజీ సంచాలకులు ఎంసీ రవీంద్ర, కంపెనీ ప్రతినిధి ఆరీఫ్ హుస్సేన్ తెలిపారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కాలేజీ అధినేత కె.నిర్మల, డైరెక్టర్ రవీంద్ర, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ప్లేస్ మెంట్ అధికారి మునీర్ శుభాకాంక్షలు తెలుపారు.